
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## ౯౯ వ భాగం

# భగవంతుడి అవతార వైభవం

బ్రహ్మ నారదుడితో అవతార విశేషాలు చెప్తూ ఇప్పుడు మత్స్యావతారం గురించి చెప్తున్నాడు. ఇక్కడనుంచీ వచ్చేవి మనకి బాగా తెల్సిన దశావతారాలు. అయితే బ్రహ్మ అన్నీ ఒకే వరసలో చెప్పడు నారదుడికి.

సీ. ఘనుఁడు వైవస్వతమనువుకు దృష్టమై
యరుదెంచునట్టి యుగాంత సమయ
మందు విచిత్రమత్స్యావతారము దాల్చి
యఖిలావనీమయం బగుచుఁ జాల
సర్వజీవులకు నాశ్రయభూతుఁ డగుచు నే
కార్ణవంబైన తోయముల నడుమ
మన్ముఖశ్లథ వేదమార్గంబులను జిక్కు
వడకుండ శాఖ లేర్పడఁగఁ జేసి [2-142]

తే. దివ్యు లర్థింప నా కర్థిఁ దెచ్చి యిచ్చి
మనువు నెక్కించి పెన్నావ వనధి నడుమ
మునుఁగకుండంగ నరసిన యనిమిషావ
తార మేరికి నుతియింపఁ దరమె? వత్స! [2-142.1]

ప్రళయం సంభవించే ముందు వైవశ్వత మనువు, మునులతో, విత్తన ఔషధాలతో కూర్చున్న పడవని అంతా నీటిమయం అయినప్పుడు భగవంతుడు మత్స్యావతారంతో ఆ పడవని సర్వ జీవులకీ ఆశ్రయభూతుడౌతూ ఆదుకున్నాడు. నిద్రలోకి నా నుండి జరిపోయిన వేదాలు పాడవకుండా దాచి దేవతల కోరిక ప్రకారం మళ్ళీ లేచిన నాకు ఇచ్చాడు. ఆతువంటి మత్స్యావతారాన్ని వర్ణించడం ఎవరికైనా సాధ్యపడుతుందా?

మ. అమృతోత్పాదన యత్నులై విబుధ దైత్యానీకముల్, మందరా
గముఁ గవ్వంబుగఁ జేసి యబ్ధిదఱువంగాఁ గవ్వపుంగొండ వా
ర్ధి మునుంగన్ హరి కూర్మరూపమున నద్రిం దాల్చెఁ దత్పర్వత
భ్రమణవ్యాజత వీఁపుఁదీట శమియింపం జేయఁగా నారదా! [2-144]

ఇప్పుడుచెప్పబోయేది మనకి తెల్సిన దశావతారాల్లో కూర్మావతారం. దేవదానవులు అమృతం కోసం మందర పర్వతాన్ని కవ్వంగా చేసి పాల సముద్రాన్ని చిలకడం (అబ్ది దరువంగా) మొదలుపెడితే ఆ పర్వతం సముద్రంలో కుదురుగా నిలుచోడానికి కిందన ఏమీ లేక మునిగినప్పుడు భగవంతుడు కూర్మావతారంతో దాన్ని నిలుచోపెట్టాడు. అది ఆయన వీపు దురద తీర్చుకోవడానికా అన్నట్టు ఉంది తప్ప మరేమీ కాదు.

గమనించారా? దేవదానవుల సాగర మధనంలో బయటకి వచ్చిన ధన్వంతరి కూడా భగవంతుడి స్వరూపమే. ఆ మధనంలో పుట్టిన కల్పవృక్షం, కామధేనువూ, ఉచ్ఛైశ్రవం, ఐరావతం (ఉచ్ఛైశ్రవసమశ్వానం.... ఐరావతం గజేంద్రాణాం.. భగవద్గీత విభూతి యోగం) కూడా భగవంతుడి రూపులే కానీ బ్రహ్మ అవన్నీ అవతారం అన్నట్టూ చెప్పలేదు. ముఖ్యమైనవి చెప్పడం ఒకటే ఈ స్కంధంలో చూస్తాం.

మ. సురలోకంబుఁ గలంచి దేవసమితిన్ స్రుక్కించి యుద్యద్గదా
ధరుఁడై వచ్చు నిశాచరుం గని, కనద్దంష్ట్రా కరాళస్య వి
స్ఫురిత భ్రూకుటితో నృసింహగతి రక్షోరాజ వక్షంబు భీ
కరభాస్వన్నఖరాజిఁ ద్రుంచె త్రిజగత్కల్యాణసంధాయియై. [2-146]

అమోఘమైన గదతో వస్తూ దేవతలను జయించే హిరణ్యకశిపుణ్ణి ఎవరూ ఎదిరించలేకపోయేసరికి భగవంతుడు నృశింహావతారంలో వాడి గోళ్లతో వాడిని చంపి జగత్కళ్యాణం కావించాడు. ముందు చెప్పబోయేది ఆదిమూలావతారం. ఇది గజేంద్రమోక్షం కథ. అయితే మనకి తెలిసిన దశావతారాలలో ఇది ఒక అవతారం కాదు.

మ. కరినాథుండు జలగ్రహగ్రహణ దుఃఖాక్రాంతుఁడై వేయి వ
త్సరముల్ గుయ్యిడుచుండ వేల్పులకు విశ్వవ్యాప్తి లేకుండుటన్
హరి నీవే శరణంబు నా కనినఁ గుయ్యాలించి వేవేగ వా
శ్చరముం ద్రుంచి కరీంద్రుఁ గాచె మహితోత్సాహంబునం దాపసా! [2-148]

గజేంద్రుడు (కరినాధుండు) నీటిలో మొసలిచే (జలగ్రహణం) పట్టుబడ్డప్పుడు కష్టంతో వేయి సంవత్సరాలు ప్రార్ధించాడు. దేవతలు విశ్వమయులు కారు కాబట్టి ఏమీ చేయలేకపోతే “హరీ, నీవే శరణం“ అని ఆక్రందన చేసినప్పుడు వెనువెంఠనే (వేవేగ) వచ్చి మహోత్సాహంతో ఆ మకరిని చంపి గజేంద్రుణ్ణి కాపాడాడు. మనకి తెల్సిన నృశింహావతారం తర్వాతది వామనావతారం. మొదట్లో ప్రాణులు నీటిలో ఉండేవి అవి మెల్లిగా భూమి మీదకి పాకాయి అని తెల్సినట్టే, భాగవతంలో అవతారాలు మొదట్లో మత్స్యం, కూర్మ, వరాహం, నృసింహ, ఆ తర్వాత కోపంగా మనిషి (పరశురామావతారం), పైన ధర్మజ్ఞుడిగా రామావతారం, ఆ తర్వాతది లీలామానుషవిగ్రహమైన కృష్ణావతారం. కానీ ఇక్కడ బ్రహ్మ చెప్పేవి ఈ వరసలో ఉండవు.

సీ. యజ్ఞేశ్వరుండగు హరి విష్ణుఁ దదితి సం
తానంబునకు నెల్లఁ దమ్ముఁ డయ్యుఁ
బెంపారు గుణములఁ బెద్ద యై వామన
మూర్తితో బలిచక్రవర్తిఁ జేరి
తద్భూమి మూడు పాదమ్ము లనడిగి ప
దత్రయంబునను జగత్త్రయంబు
వంచించి కొనియును వాసవునకు రాజ్య
మందింప నీశ్వరుండయ్యు మొఱఁగి [2-150]

తే. యర్థిరూపంబు గైకొని యడుగ వలసె
ధార్మికుల సొమ్ము వినయోచితముగఁ గాని
వెడఁగుఁదనమున నూరక విగ్రహించి
చలనమందింపరాదు నిశ్చయము పుత్ర! [2-150.1]

ఇది వామనావతారం. అదితి సంతానానికి కడగొట్టు బిడ్డగా వామనమూర్తిగా భగవంతుడు పుట్టాడు. బలి చక్రవర్తి దగ్గిరకి వెళ్ళి మూడడుగుల నేల దానం అడిగాడు, ఎందుకంటే తాను సర్వేశ్వరుడై ఉండి కూడా వాసవుడికి (తన అన్న అయిన ఇంద్రుడికి) రాజ్యం ఇప్పించడం కోసం. అంతటి బలశాలీ, సర్వేశ్వరుడూ ఆఖరికి యాచించవల్సి వచ్చింది. ధర్మాత్ములైన వారి దగ్గిర్నుంచి వినయంగా అడిగి పుచ్చుకోవాలి తప్ప మూర్ఖంగా (వెడగుదనమున) యుద్ధం చేయకూడదు. ఇది తెల్సినవాడు కనకనే దేహీ అని అర్థించాడు బలిని. అయితే అడినప్పుడు ఇవ్వను అనకుండా ఇచ్చినవాడి గొప్పదనం మర్చిపోకూడదు కనక బ్రహ్మ ఆ బలి గురించి కూడా గొప్పగా చెప్తున్నాడిప్పుడు.

చ. బలి నిజమౌళి నవ్వటుని పాదసరోరుహ భవ్యతీర్థ ము
త్కలిక ధరించి, తన్నును జగత్త్రయమున్ హరికిచ్చి, కీర్తులన్
నిలిపె వసుంధరాస్థలిని నిర్జరలోక విభుత్వహానికిం
దలఁకక శుక్రు మాటల కుఁదారక భూరివదాన్యశీలుఁడై. [2-151]

పరమదాత (భూరివదాన్యశీలుడై) అయిన బలి చక్రవర్తి వచ్చిన వామనుడి పాదాలు కడిగి ఆ నీళ్ళు నెత్తిమీద పోసుకుని తననీ, అడిగిన మూడు అడుగులనీ (తన్నును, జగత్రయమున్) సంతోషంగా దానం ఇచ్చాడు. దీనివల్ల విశ్వం అంతా శాశ్వతమైన కీర్తి సంపాదించుకున్నాడు. దానవలోకం మీద తన పెత్తనం (విభుత్వహానికిం) పోతుందనీ, గురువు దానం ఇవ్వవద్దన్నాడనీ అన్నా ఎవరినీ లక్ష్యపెట్టలేదు.

వ. మఱియు నప్పరమేశ్వరుండు నారదా! హంసావతారంబు నొంది యతిశయ భక్తియోగంబున సంతుష్టాంతరంగుం డగుచు నీకు నాత్మతత్త్వప్రదీపకంబగు భాగవతమహాపురాణం బుపదేశించె; మన్వవతారంబు నొంది స్వకీయ తేజఃప్రభావంబున నప్రతిహతంబైన చక్రంబు ధరియించి దుష్టవర్తనులైన రాజుల దండించుచు శిష్ట పరిపాలనంబు సేయుచు నాత్మీయ కీర్తిచంద్రికలు సత్యలోకంబున వెలింగించె; మఱియు ధన్వంతరి యన నవతరించి తన

నామస్మరణంబున భూజనంబునకు సకలరోగ నివారణంబు సేయుచు నాయుర్వేదంబుఁ గల్పించె నింకఁ బరశురామావతారంబు వినుము.

[2-152]

ఆ తర్వాత భగవంతుడు హంసావతారం ధరించి నీ (నారదుడి) భక్తి యోగానికి సంతోషించి ఆత్మ తత్త్వం తెలియచేయడానికి భాగవత పురాణం ఉపదేశించాడు కదా; మనువుగా పుట్టి చక్రాయుధంతో దుర్జనులైన వారిని శిక్షించాడు. ఇప్పుడు పాలసముద్ర మధనంలో బయటకొచ్చిన ధన్వంతరి గురించి చెప్తున్నాడు. భువిలో పుట్టిన వారికి సాధారణంగా వచ్చే సగలరోగాలకీ ధన్వంతరి అవతారంగా ఆయుర్వేదం కల్పించాడు.

మ. ధరణీ కంటకులైన హైహయనరేంద్రవ్రాతమున్ భూరివి
స్ఫురితోదారకుఠారధారఁ గలనన్ ముయ్యేడు మాఱుల్ పోరిం
బొరి మర్దించి, సమస్త భూతలము విప్రుల్ వేఁడఁగా నిచ్చి తాఁ
జిర కీర్తిన్ జమదగ్నిరాముఁ డన మించెం దాపసేంద్రోత్తమా! [2-153]

ఈ పద్యం పరశురామావతారం గురించి. హైహయ రాజులు దురుసుగా ప్రవర్తించేసరికి పరశురాముడిగా అవతరించి ఇరవై ఒక్కసార్లు (ముయ్యేడు అంటే 3x7 = 21) వారిని చెండాడాడు. అలా జమదగ్ని కొడుకుగా పుట్టిన పరశురాముడు రాజులని గెలిచాక నెగ్గిన సమస్త భూతలాన్ని అంతటినీ అడిగిన విప్రులకి దానం చేసి శాశ్వతమైన కీర్తి సంపాదించుకున్నాడు.

సీ. తోయజహిత వంశ దుగ్ధ పారావార
రాకా విహార కైరవహితుండు
కమనీయ కోసలక్ష్మాభృత్సుతా గర్భ
శుక్తి సంపుట లసన్మౌక్తికంబు
నిజపాదసేవక వ్రజ దుఃఖ నిబిడాంధ
కార విస్ఫురిత పంకరుహసఖుఁడు
దశరథేశ్వర కృతాధ్వరవాటికా ప్రాంగ
ణాకర దేవతానోకహంబు [2-155]

తే. చటుల దానవ గహన వైశ్వానరుండు
రావణాటోప శైల పురందరుండు
నగుచు లోకోపకారార్థ మవతరించె
రాముఁడై చక్రి లోకాభిరాముఁ డగుచు. [2-155.1]

ఇది సులభంగా అర్థమయ్యే రామావతారం మీద పద్యం. శ్రీహరి (చక్రి) లోకాభిరాముడిగా (లోకాలకి ఉపకారం చేసేవాడిగా) దశరధుడి పుత్రకామేష్టి తర్వాత జనించాడు. ఈ రాముడు సూర్యవంశానికి పున్నమి చంద్రుడివంటివాడు, కౌసల్యకి పుట్టిన మేలి ముత్యం, తన పాదసేవకుల శోకాలని పోగొట్టే భగవానుడు. దానవులనే వనాలని దహించే కార్చిచ్చు. రావణుడి గర్వం అణిచేవాడు.

క. చిత్రముగ భరత లక్ష్మణ
శత్రుఘ్నుల కర్థి నగ్రజన్ముం డగుచున్
ధాత్రిన్ రాముఁడు వెలసెఁ బ
విత్రుఁడు దుష్కృత లతా లవిత్రుం డగుచున్. [2-156]

భరత, లక్ష్మణ, శత్రుఘ్నులకి అగ్రజుడిగా రాముడు భూమిమీద అవతరించాడు. ఎలా అవతరించాడు? పాపాలనే తీగలని అవలీలగా ఛేదించే కొడవలిలాగా (దుష్కృత లతా లవిత్రుం డగుచున్).

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS